ప్రజాశక్తి
శనివారం 27 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం

నేటి సాయంత్రం 5.15 గంటలకు పార్వతీపురం రాక

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

బ్రహ్మపూర్-సూరత్ (ఉధ్నా) మధ్య నడిచే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ప్రారంభం కాబోతున్నాయని భారతీయ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.పవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రైలు ఒడిశా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల ప్రధాన పట్టణాలను కలుపుతూ వ్యాపార, పారిశ్రామిక, శ్రామిక రవాణాను సులభతరం చేస్తుందని చెప్పారు. ఈ రైలు పార్వతీపురం స్టేషన్‌కు శనివారం సాయంత్రం 5.15 గంటలకు చేరుతుందని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా వాసులు ఈ రైలు సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆధునిక ఎల్‌హెచ్‌బి కోచ్‌లు, మెరుగైన సీటింగ్, సౌకర్యవంతమైన ఆన్‌బోర్డు సదుపాయాలతో రైలు ప్రయాణికులకు సౌకర్యవంతమైన అనుభవాన్ని అందిస్తుందని వివరించారు.

మృత్యుఒడికి విద్యా కుసుమం

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

విద్యార్థి అంజలి (ఫైల్)

మన్యం జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందక, పౌష్టికాహారం లోపం, ఇతర కారణాల వల్ల గిరిజన విద్యార్థులు పసిప్రాయంలోనే మృత్యుఒడికి చేరుతున్నారు. ఉన్నత చదువులు చదవాలని, ఉద్యోగం చేసి తల్లిదండ్రుల కష్టాలను తీర్చాలని ఆ గిరిజన విద్యార్థులు కన్న కలలు.. కల్లలుగానే మిగిలిపోయాయి. చదువుకునే ప్రాయంలో పసిమొగ్గలు అనారోగ్యం కారణంగా చనిపోవడంతో ఆ ఇంట విషాదాన్ని నింపుతున్నాయి.

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కురుపాం గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పువ్వల అంజలి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందింది. విద్యార్థి స్వగ్రామం గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డు ఖల్లు పంచాయతీ కంబగూడ. విద్యార్థిని అంజలి జ్వరం, కడుపునొప్పి లక్షణాలతో బాధపడుతుండగా, దసరా సెలవులకు ఇంటికి తీసుకెళ్లేందుకు ఈ నెల 20న ఆమె తండ్రి పాఠశాలకు వెళ్లాడు. విద్యార్థిని అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గుర్తించి ఇంటికి తీసుకెళ్లాడు. జ్వరంగా ఉండటంతో తల్లిదండ్రులు దుడ్డుఖల్లు పిహెచ్‌సిలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యం అందించారు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి అంజలి మరణించింది. విద్యార్థిని మృతితో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ బిడ్డకు అనారోగ్యం వాటిల్లితే పాఠశాల సిబ్బంది కనీసం సమాచారం ఇవ్వలేదని ఆమె తండ్రి వాపోయారు.

ఆదివాసీ ఆరోగ్యం కనుమరుగు

గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు స్థానికంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆదివాసీ ఆరోగ్యం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యాసంస్థలు మొదలుకొని కెజిహెచ్ వరకు హెల్త్ వాలంటీర్లను నియమించింది. ఆశ్రమ పాఠశాలలు, ఆసుపత్రుల్లో సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత కల్పించింది. దీంతోపాటు ఐటిడిఎలో ఒక వైద్యాధికారి, మోనిటరింగ్ అధికారి ఉండేవారు. సీరియస్ కేసులను ఇక్కడ నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలించే బాధ్యత వహించేవారు. దీంతో విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందేవి. తద్వారా మరణాలను నివారించేవారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో హెల్త్ వాలంటీర్లను తొలగించడంతో సేవలు నిలిచిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిపెట్టలేదు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించాలి

ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఐటిడిఎ అధికారుల దృష్టి సారించాలి. ప్రభుత్వం ఇతర కార్యక్రమాలకు ఇస్తున్న ప్రాధాన్యత విద్యార్థుల ఆరోగ్యం పట్ల చూపడం లేదు. సకాలంలో వైద్యం అందక విద్యార్థులు చనిపోతున్నా అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

- పి.తిరుపతిరావు, మండల కార్యదర్శి, ఆదివాసీ గిరిజన సంఘం

వైద్య సేవలు కరువు

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులకు వైద్య సేవలు అందడం లేదు. గతంలో పనిచేసిన హెల్త్ వాలంటీర్లను ప్రభుత్వం తొలగించడంతో సేవలు కరువయ్యాయి. మరోవైపు విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు. ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు స్పందించాలి.

- పల్లా సురేష్, గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు

బాలిక కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

పార్వతీపురం : విద్యార్థిని అంజలి కుటుంబానికి రూ.5 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.అఖిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల19న అంజలి అనారోగ్యంతో ఉందని వార్డెన్ చెప్పారని తెలిపారు. 20న హాస్టల్లో సౌకర్యాలు లేక ఇంటికి వెళ్లిపోయిందని, గురువారం రాత్రి ఇంటి వద్ద మరణించిందని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలు నియమించి ఉంటే విద్యార్థుల మరణాలు జరగబోవని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఎఎన్‌ఎంల నియామకానికి సంబంధించిన ఫైలుపై మొట్టమొదటి సంతకం చేశారని, ఇప్పటివరకు అమలు కాలేదని తెలిపారు. జిల్లాలో రెండు ఐటిడిఎల పరిధిలో 58 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. ఐటిడిఎల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడిందన్నారు. మన్యంలో జరుగుతున్న గిరిజన విద్యార్థులు మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరంలోనే ఇప్పటివరకు ఏడుగురు విద్యార్థులు మృతి చెందడం బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ప్రతినెల మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు సురేష్, టౌన్ కమిటీ సభ్యులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌కుమార్‌కు అవార్డు

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న శ్యామ్‌కుమార్

మండలంలోని కొమ్మువానివలస గ్రామానికి చెందిన గిరిజన శాస్త్రవేత్త సంగంరెడ్డి శ్యామ్‌కుమార్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన జాతీయ భూగోళశాస్త్ర లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు - 2024 అందుకున్నారు. ఖనిజాల ఆవిష్కరణ, అన్వేషణ విభాగంలో ఆయన ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ అవార్డు లభించింది. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు రాష్ట్రపతి ముర్ము అవార్డును ప్రదానం చేశారు. శ్యామ్‌కుమార్ ప్రస్తుతం విశాఖపట్నంలో సీనియర్ జియాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గిరిజన యువకుడు ఉన్నత శిఖరాలను అధిరోహించి, దేశస్థాయిలో గుర్తింపు పొందడం పట్ల స్వగ్రామమైన కొమ్మువానివలస ప్రజలు, గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు ఎకరాల్లో మొక్కజొన్న ధ్వంసం

రైతుల్ని వెంటాడుతున్న ఏనుగులు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఏనుగులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

మండలంలోని పెదమరికి పంచాయతీ పరిధిలోని చినమరికి గ్రామానికి చెందిన డొల్లు పారినాయుడి రెండు ఎకరాల మొక్కజొన్న పంటని గురువారం రాత్రి ఏనుగులు ధ్వంసం చేశాయి. కొద్ది రోజుల క్రితం కొమరాడ మండలంలో తిష్ట వేసిన ఏనుగులు పార్వతీపురం మండలంలోని పెదమరికి పంచాయతీలోకి ప్రవేశించాయి. పంట చేతికొచ్చే సమయంలో మొక్కజొన్న పంటని ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతు పారినాయుడు తీవ్రంగా నష్టపోయారు. ఇంతవరకు జిల్లాలో వందలాది ఎకరాల్లో రైతుల పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఏనుగులకు ఇష్టమైన ఆహారం, తాగునీరు జిల్లాలో పుష్కలంగా లభిస్తుండడంతో అవి జిల్లాని వీడడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

చంద్రబాబుతో భంజ్‌దేవ్ భేటీ

మన్యం జిల్లాలో టిడిపి పరిస్థితిపై చర్చ

ప్రజాశక్తి-పార్వతీపురం

సిఎం చంద్రబాబుతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్

సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ శుక్రవారం కలిశారు. అమరావతిలో అసెంబ్లీ లాబీలో వారిని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి భంజ్‌దేవ్ కలిశారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో పార్టీ స్థితిగతులు, సాలూరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై భంజ్‌దేవ్ వారితో చర్చించినట్లు తెలుస్తోంది. త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో పార్టీ అగ్రనేతలతో భంజ్ దేవ్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. మూడుసార్లు ఎమ్మెల్యే అయిన భంజ్‌దేవ్ నామినేటెడ్ పదవి కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించినప్పటికీ ఆ పదవిని భంజ్‌దేవ్ సున్నితంగా తిరస్కరించారు. భంజ్‌దేవ్‌కి ఉన్న సీనియారిటీని దృష్టిలో పెట్టుకొని పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని అధిష్టానం సూచిస్తున్నా వయోభారం దృష్ట్యా తాను ఆ బాధ్యతలు నిర్వహించలేనని ఆయన స్పష్టం చేశారు.

సాలూరు నియోజకవర్గంలో టిడిపి స్థితిగతుల గురించి కూడా చంద్రబాబు, లోకేష్.. భంజ్‌దేవ్‌ని ఆరా తీసినట్లు తెలిసింది. గడిచిన ఏడాదిన్నర కాలంలో మంత్రి సంధ్యారాణి నాయకత్వంలో పార్టీ పరిస్థితి పూర్తిగా దిగజారిందనే నివేదికలు అధిష్టానం వద్ద ఉన్నాయి. మండల, పట్టణ నాయకులు మంత్రి సంధ్యారాణి వ్యవహార శైలిపై అసంతృప్తితో రగిలిపోతున్న నేపథ్యంలో భంజ్‌దేవ్ టిడిపి అగ్రనాయకులతో చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర కోరారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రస్తుతం సరఫరా అవుతున్న నీరు తాగడానికి కాదు మరే ఇతర ప్రయోజనాలకు కూడా పనికిరాని విధంగా ఉందన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీకి సరిపడా తాగునీరు సరఫరా చేయడం లేదని, దీనివల్ల పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నియోజకవర్గంలో సాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలి

- అధికారులకు, సిబ్బందికి శిక్షణ
- కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. అందరి అధికారులు, సిబ్బంది భాగస్వామ్యం, సహకారంతోనే అది సాధ్యవుతుందన్నారు. ఇందుకోసం జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ కార్యక్రమానికి ప్రతిపాదనలు చేయాలని, శిక్షణకు మాస్టర్ ట్రెయినీలను సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటి సమావేశం జిల్లా కలెక్టర్, ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసే వారికి విధిగా శిక్షలు పడేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. అటవీ ప్రాంతం గుండా, బస్సులు, ఇతర వాహనాల ద్వారా జరిగే మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంచాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే చెడు ప్రభావాలపై గ్రామ స్థాయిలో, విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల ప్రభావం పడకుండా మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గంజాయి, మత్తు పదార్థాలు అక్రమ రవాణా కాకుండా అడ్డుకట్ట వేయడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హితవు పలికారు.

ఎస్‌పి మాధవ్ రెడ్డి మాట్లాడుతూ అంతర్రాష్ట్ర సరిహద్దులలో చెక్ పోస్టులు, సిసి కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిత్యం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 17 కేసుల్లో 40 మందిని అరెస్టు చేసి 2,054 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. 16 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమానంగా ఉండే దుకాణాలు, పదార్థాలు, స్థలాలపై పటిష్ట నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. యువత మత్తుకు బానిసలు కాకుండా ఉండేందుకు కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నామని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఎస్‌పి ఎం.రాంబాబు, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఎఫ్‌ఓ జి.ఎ.పి.ప్రసూన, జిల్లా రవాణా అధికారి టి.దుర్గా ప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు ఎ.సంతోష్, జీవన్ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వై.నాగేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావు, బిసి, సాంఘిక సంక్షేమ అధికారులు ఇ.అప్పన్న, ఎం.శ్యామల, డ్రగ్ కంట్రోల్ అధికారి ఆషా షేక్, ఇతర జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మూడోలైన్‌లో స్పీడ్ ట్రయల్ రన్

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్, బొబ్బిలి

పార్వతీపురం స్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్‌కుమార్

పార్వతీపురం - డొంకినవలస మధ్య కొత్తగా వేసిన మూడో లైనులో స్పీడ్ ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయిందని రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్ కుమార్ మిశ్రా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ట్రయల్ రన్, అమృత భారత్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది వాల్తేరు డివిజన్‌కు మరో మైలురాయిగా, ఈ ప్రాంతంలో రైలు మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుందన్నారు. డొంకినవలస, బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం స్టేషన్లను కలిపే 36 కిలోమీటర్లు కొత్తగా నిర్మించిన, విద్యుద్దీకరించబడిన మూడో లైన్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత స్పీడ్ ట్రయల్‌ని పర్యవేక్షించినట్లు తెలిపారు. రాయగడ-విజయనగరం మార్గంలో డబ్లింగ్‌లో భాగంగా ఉందన్నారు. అనంతరం అధికారులు స్టేషన్ యార్డ్ క్రాస్ ఓవర్లు, హైలెవల్ ప్లాట్‌ఫారాలు, వంతెనలతో పాటు కొత్తగా అందించిన సౌకర్యాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కన్‌స్ట్రక్షన్ అంకుష్ గుప్తా, చీఫ్ బ్రిడ్జ్ ఇంజినీర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.కె.పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

కేటాయించిన ఛాంబర్‌లో ప్రభుత్వ విప్ జగదీశ్వరి

ప్రభుత్వ విప్ జగదీశ్వరికి ఛాంబర్ కేటాయింపు

ప్రజాశక్తి-కురుపాం

కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరికి అసెంబ్లీ వెలుపల శుక్రవారం విప్ ఛాంబర్‌ను ప్రభుత్వం కేటాయించింది. తొలిసారిగా అడుగు పెట్టిన ఆమె విప్ హోదాలో విధులు నిర్వహించారు.

సహకార రంగం బలోపేతానికి చర్యలు

డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున

ప్రజాశక్తి -కంటోన్మెంట్

సహకారంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు .శుక్రవారం ఉమ్మడి డిసిఎంఎస్ జిల్లా మహాజన సభ డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. డిసిఎంఎస్ చైర్మన్ గొంపకృష్ణ మాట్లాడుతూ డిసిఎంఎస్‌ను బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పాత బకాయిలు రికవరీకి చర్యలు తీసుకుంటామన్నారు. 2024-25 డిసిఎంఎస్ ఆడిట్ రిపోర్ట్ ను సభ ఆమోదం తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి పి. రమేష్, డివిజనల్ సహకార అధికారి బి.ఈశ్వరరావు, సిఇఒ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు

జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

పి జిఆర్ఎస్ ద్వారా అందిన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిర్ణీత ప్రొఫార్మా ద్వారా వివరాలను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం నాటికి నిర్దేశించిన అధికారులు వివరాలతో సిద్ధంగా ఉండాలని, మీరిచ్చే సూచనలతో సమస్యలు త్వరగా పరిష్కారం కావాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం పలు శాఖలకు చెందిన అధికారులతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. వాటిలో ఆర్ఒఎఫ్ఆర్, డి-పట్టా, రీ సర్వే, 22ఎ, రెవెన్యూ సర్వీసులు, ఇతర సమస్యలు ఉంటున్నట్లు చెప్పారు. వీటన్నిటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దాని కోసం చెక్ లిస్ట్ తయారు చేసుకొని, ఆ మేరకు పత్రాలను పరిశీలించి దరఖాస్తును స్వీకరించడం ద్వారా సమస్య సులువుగా పరిష్కారం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న దరఖాస్తులను సమస్యల వారీగా నిర్ణీత ప్రొఫార్మాలో నమోదు చేసి సోమవారానికి సిద్ధం చేస్తే, వాటిని పరిశీలించాక తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, ఎస్‌డిసి పి.ధర్మచంద్రారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కొమరాడ

నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సిఐటియు నాయకులు సాంబమూర్తి

మధ్యాహ్న భోజన కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎండిఎం కార్మికులు నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనను ఉద్దేశించి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షులు మరడాన సునీత, కార్యదర్శి రెడ్డి మల్లేశ్వరమ్మ, సాంబమూర్తి మాట్లాడారు. అరకొర వేతనాలతో మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారని, ఎంతో వ్యయప్రయాసలతో సొంత డబ్బులు పెట్టుకుని, అప్పులు తెచ్చి పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. అయినా సకాలంలో వంట బిల్లులు అందడం లేదని వాపోయారు. దీనికి తోడు ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు వంట నిర్వాహణను అప్పగించి తమ పొట్టలు కొట్టాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి నెలా బిల్లులు, జీతాలు చెల్లించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ఈ నెల 29న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎండిఎం కార్మికులు కృష్ణవేణి, అమ్మడమ్మ, పాపమ్మ, సింహాచలం, చిన్నమ్మి, గంగమ్మ, గౌరమ్మ, పొన్నాలమ్మ, అప్పల నరసమ్మ, గంగమ్మ, పార్వతి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా మరడాన సునీత, కార్యదర్శిగా రెడ్డి మల్లేశ్వరమ్మతోపాటు 8 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పైనాపిల్ పంట బాగుంది

ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ ద్వారా పంపిణీ చేసిన కొత్తరకం మారిషస్ పైనాపిల్ పంట బాగుందని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బిల్లగూడ, ఇప్పగూడ గ్రామాల్లో సాగు చేస్తున్న పైనాపిల్ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంట సాగు విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. సక్రమమైన పద్ధతిలో సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని అన్నారు. దీనిద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని అన్నారు. జీడి, మామిడి పునరుద్ధరణ పథకంలో భాగంగా జీడి, మామిడి పంట అధిక దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు పిఒ తెలిపారు. వచ్చే ఏడాది సీతంపేట మండలంలో ఈతమానుగూడ, కీసరజోడు, బిల్లగూడ, భామిని మండలంలో పాలిష్‌కోట, నల్లరాయిగూడ, మనుమకొండ గ్రామాల్లో జీడి మామిడిని ప్రయోగాత్మకంగా సాగు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల ప్రతి చెట్టుకు రెండు నుంచి మూడు కిలోల దిగుబడి పెరుగుతుందని చెప్పారు. అనంతరం సీతంపేట తురాయపువలస ఉద్యానవన నర్సరీని పరిశీలించారు. అక్కడున్న మొక్కలను పరిశీలించి, అంటుకట్టు విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఉద్యాన శాఖ అధికారి ఎస్.వి గణేష్, హెచ్‌ఒ జయశ్రీ, రైతులు తోట మొఖలింగం, పార్వతి, శీను తదితరులు పాల్గొన్నారు.

పిఒని కలిసిన గిరిజన ఐక్యవేదిక నాయకులు

సీతంపేట ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌ను గిరిజన ఐక్యవేదిక నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.తేజేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిహెచ్ లక్ష్మీనారాయణ, మన్యం జిల్లా ఎస్‌టి విజిలెన్స్ మానిటింగ్ సభ్యులు శ్రీనివాసరావు, రామారావు, తులసయ్య.. పిఒను ఛాంబర్‌లో కలిసి, సత్కరించారు. అన్ని గిరిజన సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని కోరారు.

పైనాపిల్ తోటను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండలోని మండల స్థాయి నిత్యావసర సరుకుల గోదామును పార్వతీపురం సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ స్టాక్ రిజిష్టర్లలో పేర్కొన్న విధంగా నిల్వలు ఉన్నవి, లేనివి తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, మార్గదర్శకాలను జారీచేశారు. రికార్డులు పారదర్శకంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పౌర సరఫరాల అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ చెత్త ట్రాక్టర్ అడ్డగింత

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీ చెత్త ట్రాక్టర్‌ను ఓని గ్రామస్తులు రెండో రోజు శుక్రవారమూ అడ్డుకున్నారు. ఓని గ్రామ సమీపంలో తాత్కాలిక డంపింగ్ యార్డు ఏర్పాటుచేసి, నగర పంచాయతీకి సంబంధించిన చెత్త వేస్తున్న విషయం తెలిసిందే. డంపింగ్ యార్డుతో ఇబ్బంది పడుతున్నామని, ఇక్కడ వేస్తే ఊరుకోబోమంటూ గురువారం వైస్ ఎంపిపి కె.సూర్యప్రకాశ్, లుంబురు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర, స్థానికులు అడ్డుకున్నారు. దీంతో చెత్త ట్రాక్టర్ వెనుదిరిగింది. మళ్లీ శుక్రవారం చెత్త తీసుకుని ట్రాక్టర్ రావడంతో మరోసారి అడ్డుకుని, ట్రాక్టర్‌ను వెనక్కి పంపించారు. ఇక్కడ చెత్త వేస్తే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు.

ఆర్ఎస్ఇటిఐ స్థల పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా ప్రధాన కేంద్రంలో ఏర్పాటుకానున్న ఆర్ఎస్ఇటిఐ నిర్మాణ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఇటిఐ)ను ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం సంకల్పించిన సంగతి విదితమే. అందులో భాగంగా పార్వతీపురం మండలం కొత్తవలసలో కొత్త ఆర్ఎస్ఇటిఐ నిర్మాణం కోసం లీజు ప్రాతిపదికన భూమిని కేటాయింపుపై స్థలాన్ని మండల సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ పర్యటనలో రెవిన్యూ, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ అనంతలక్ష్మి

శంబరలో రాష్ట్రీయ పోషణ మాసం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని శంబర గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రం-4 వద్ద సర్పంచ్ సింహాచలమమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ వసంత లక్ష్మి మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఉప సర్పంచ్ ఎ.వెంకటరమణ, అంగన్వాడీ టీచర్ సూర్యకాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం : కర్రోతు

ప్రజాశక్తి - భోగాపురం

రైతు సంక్షేమమే తమ ప్రథమ లక్ష్యం అని, రైతుల ప్రయోజనాల కోసం కొత్త ప్రాజెక్టులు, పథకాలు అమలు చేస్తామని మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు అన్నారు. శుక్రవారం విజయవాడలోని మార్క్‌ఫెడ్ కేంద్ర కార్యాలయంలో మార్క్‌ఫెడ్ బోర్డు డైరెక్టర్లు అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు మద్దతు, పంటలకు న్యాయపరమైన ధరల కల్పన, మార్కెట్ విస్తరణ, సహకార రంగ బలోపేతంపై విస్తతంగా చర్చించారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ ఎండి మణిజీర్ జిలానీ, జిఎం శ్రీనివాసరావు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

1998 డిఎస్‌సి ఎస్‌జిటి, ఎంటిఎస్ ఉపాధ్యాయుల సర్వీసు క్రమబద్ధీకరణ చేయాలని ఎమ్మెల్యే బేబినాయనను ఎంటిఎస్ ఉపాధ్యాయులు కోరారు. అమరావతిలో శుక్రవారం ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరారు. ఎంటిఎస్ ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ చేసి 62ఏళ్లకు సర్వీసు పెంచాలని, 12నెలలు వేతనం వచ్చేలా చూడాలని కోరారు. 11నెలలు జీతం ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అన్ని అర్హతలు ఉన్న తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎంటిఎస్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బేబినాయన హామీ ఇచ్చారు.

డిగ్రీ రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపు కోట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు రెండు విడత అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని 29 నుంచి అక్టోబర్ ఒకటవ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని కళాశాలకు వస్తే ఉచితంగా కళాశాలలోనే రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు బీకాంలో చేరే విద్యార్థులు 9000224642, బిఏలో చేరే విద్యార్థులు 72078 80690, బిఎస్‌సిలో చేరే విద్యార్థులు 94753 54647 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

యూరియాపై ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని ఎఒ పి.శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది 900 టన్నులు యూరియా కోసం ఇండెంట్ పెట్టి ఆర్‌ఎస్‌కెల ద్వారా ఇప్పటి వరకూ 300 టన్నులు పంపిణీ చేశామన్నారు. ప్రయివేట్ డీలర్ల ద్వారా 350 టన్నులు యూరియా ఇచ్చినట్లు తెలిపారు. మూడవ దశలో 250 టన్నులు ఇండెంట్ పెట్టినట్లు చెప్పారు. కాగా ప్రస్తుతం వరి పంట దుబ్బు చేసుకునే దశ నుండి పాలు పోసుకునే దశలో ఉందని ఎంటియు 1121 రకంలో ఆకు ముడత, పాము పొడ తెగుళ్ల నివారణకు ప్రోఫినోపాస్ 50 శాతం, ఈపిఎస్‌పి - 400 గ్రాములు, ప్రోపికోనజోల్ 5శాతం ఈసి - 200 మిల్లీ లీటర్లు చొప్పున కలిపి 200 లీటర్ల మందు ద్రావణం ఒక ఎకరా పొలంలో పిచికారి చేసుకోవాలని సూచించారు.

జీవనశైలి మార్పుతో ఆరోగ్యం సొంతం

డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

వైద్య సేవలపై ఆరాతీస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-సీతానగరం

ఆరోగ్యకరమైన జీవనశైలితో వ్యాధులను దూరం చేయవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు వెల్లడించారు. పెదభోగిలిలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్ల వద్ద అందజేస్తున్న ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు పరిశీలించారు. ఎంత మంది వైద్య సేవలు వినియోగించుకున్నారో రికార్డులో పరిశీలించి, అందుతున్న సేవలపై, వారి అనారోగ్య సమస్యలపై అక్కడ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమ వివరాల ఆన్‌లైన్ నమోదు తీరుపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు ఆరోగ్య సూత్రాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సరైన జీవన శైలి, ఆహార నియమావళి పాటించాలన్నారు. నూనె, కొవ్వుతో కూడిన, తీపి పదార్థాలు ఆహారంలో సాధ్యమైనంత వరకు తగ్గించాలని చెప్పారు. ఉప్పు కూడా మితంగా వాడాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. రోజులో కనీసం కొంత శారీరక శ్రమ ఉండాలని, నీరు ఎప్పటికపుడు తాగాలని అన్నారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. దినచర్యలో వీటిని అలవాటుగా మార్చుకోవాలని, తద్వారా దీర్ఘకాలిక రోగాలు, కేన్సర్ బారిన పడకుండా, ఇంకా అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహనరావు, వైద్యాధికారి ఉషారాణి, సిహెచ్‌ఒ ఎస్‌వి రమణ, సూపర్వైజర్ భవాని, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

280 మందికి వైద్య పరీక్షలు

వీరఘట్టం : మండలంలోని బిటివాడ, తూడి గ్రామాల్లో శుక్రవారం ఎస్ఎన్ఎస్‌పిఎ కార్యక్రమంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. సుమారు 280 మందికి వైద్యాధికారులు ఎ.మానస, పి.గణేష్, గౌతమ్ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇందిర, లలిత కుమారి, చినబాబు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం.. రోగులను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి మానస

కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యత

మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

ప్రజాశక్తి-సాలూరు

నిత్యం పట్టణ పరిశుభ్రత కోసం శ్రమించే మున్సిపల్ కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ-2025లో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రియాంక, మాధురి కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కమిషనర్ టి.టి. రత్నకుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లావేటి బాలకృష్ణ పాల్గొన్నారు.

విశ్రాంతి భవనం ప్రారంభం

విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కరణం బాబ్జి

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలో గొట్టుమంగళపురం గ్రామంలో విశ్రాంతి భవనాన్ని శుక్రవారం సర్పంచ్ కరణం బాబ్జి ప్రారంభించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, పంచాయతీ కార్యదర్శి బి .వెంకటరమణ వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణం కార్మిక సంఘం బాధ్యత తీసుకున్నప్పటికీ, సుమారు 77 మంది దాతల సహాయంతో నిర్మించినట్లు తెలిపారు. విద్యా కమిటీ చైర్మన్ గొర్లి రవికుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు మజ్జి వీరనాయుడు, కార్యదర్శి బబ్బాది శివ, తదితరులు పాల్గొన్నారు.

డిసిహెచ్‌ఎస్‌కి మాతృ వియోగం

ప్రజాశక్తి-వీరఘట్టం

మన్యం జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి గొర్లె నాగభూషణరావు మాతృమూర్తి గొర్లె వరహాలమ్మ శుక్రవారం మృతి చెందారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆమె మృతికి పలువురు వైద్యులు, పట్టణ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు

బిఎంఆర్ థియేటర్ వద్ద కూటమి నాయకుల సందడి

ప్రజాశక్తి-వీరఘట్టం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన ఒజి సినిమా ప్రదర్శిస్తున్న బిఎంఆర్ థియేటర్ వద్ద శుక్రవారం కూటమి నాయకులు సందడి చేశారు. నాయకులు జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, జనసేన జానీ, సరిపల్లె అచ్యుత్, తదితరులు కేక్ కట్ చేసి, కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-సాలూరు

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.శిరీషా తెలిపారు. శుక్రవారం మండలంలో కురుకుట్టి, తోణాం రైతు సేవా కేంద్రాల పరిధిలోని కురుకుట్టి, గుడ్డంగానివలస, బొర్రమామిడివలస గ్రామాలలో పొలం పిలుస్తోంది, జాతీయ ఆహార భద్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఈ నెలాఖరులోపు తమ పంటలను తప్పనిసరిగా ఇ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట నమోదు ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. యూరియాకు బదులుగా నానో యూరియాను వాడడం వల్ల పంటకు కావాల్సిన నత్రజని లభించడమే కాకుండా, భూమి, గాలి కాలుష్యం కూడా తగ్గుతాయని వివరించారు.

వంశధార నది మార్గంలో దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి -భామిని

మండలంలో పసుకుడి గ్రామంలో వంశధార నదికి వెళ్లే మార్గంలో ఇటీవల విద్యుత్ సిబ్బంది స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈ స్తంభాలకు పసుకుడి సర్పంచ్ బెవర భార్గవ నాయుడు శుక్రవారం వీధి దీపాలను అమర్చారు. కార్తీక మాసంలో గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున వంశధార నది స్నానానికి వెళుతుంటారని, వారికి ఇబ్బంది లేకుండా వీధి దీపాలు ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు.

శిక్షణకు ఎంపికలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఇటీవల ఎపిఎస్‌ఆర్‌టిసిలో ఐటిఐ అప్రెంటిస్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులలో అర్హత మేరకు ఎంపికైన వారిని అలాట్‌మెంట్ చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు పనిపై దృష్టి పెట్టి, శిక్షణను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు డిపిటిఒ చేతుల మీదుగా జిల్లాలోని డిపోలకు అలాట్మెంట్ పత్రాలను అందజేశారు.



అలాట్‌మెంట్ పత్రాలను అందజేస్తున్న డిపిటిఒ వెంకటేశ్వరరావు

పత్తిలో ఆకుముడత తెగులు

ప్రజాశక్తి-మక్కువ

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పత్తి పంటకు తెగుళ్ల సోకుతున్నాయి. పలుచోట్ల అధిక వర్షాల వల్ల పొలంలో నీరు చేరడంతో మొక్కలు చాలా వరకు చనిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆకుముడత, కిల్లి ఆకు తెగుళ్లతో పురుగు ప్రవేశించి పంటలకు నష్టం చేకూరుస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తెగుళ్ల నివారణకు సస్యరక్షణ మందులు పిచికారీ చేస్తే సరిపోతుందని వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్ భారతి సూచించారు. ప్రోఫనపాస్, సైప్రో మెత్రిన్ ద్రావణాన్ని ఎకరాకు 400 ఎంఎల్ తీసుకోవాలని రైతులకు తెలిపారు. 15 లీటర్ల వాటర్ ట్యాంకులో 30 మిల్లీలీటర్ల మందును కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. పంటలకు ఏ విధమైన తెగులు సోకినా రైతు సేవా కేంద్ర సిబ్బందికి తెలపాలని రైతులకు సూచించారు.

ఆకుముడత తెగులు సోకిన పత్తి పంట

ప్రారంభానికి నోచని భవనాలు

బిల్లులు అందక కాంట్రాక్టర్లకు ఇబ్బందులు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని పంచాయతీ భవనాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఆ భవన నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు ప్రభుత్వం చెల్లించక వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మొదట విడుదల 24 పంచాయతీలకు ఉపాధి హామీ నిధులతో పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక ప్రతి పంచాయతీకి పక్కా భవనాలు ఉండాలని భవన నిర్మాణం కోసం రూ.11 లక్షలు చొప్పున మంజూరు చేసింది. మండలంలో బూర్జ, రామవరం, రంగంపేట, దయానిధి పురం, ఎస్ఎస్ఆర్ పురం, ఆర్.వెంకంపేట, చినబోగిలి, సూరంపేట, పాపంవలస, ఇప్పలవలస, బగ్గందొరవలస, ఆర్.వెంకంపేట తదితర గ్రామాలలో పంచాయతీ భవనాలు నిర్మాణాలు పూర్తిచేశారు. కొన్ని భవనాలు ప్రారంభానికి నోచుకున్నాయి. రామవరం, బూర్జ పంచాయతీ భవనాలు నిర్మాణాలు పూర్తిచేసుకుని ప్రారంభానికి నోచుకోలేదు.

రామవరం పంచాయతీ భవనం నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ కొల్లి సురేష్‌కు నేటికీ నాలుగు లక్షల రూపాయలు బిల్లు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో వర్క్ ఐడి పేరుతో ఆ భవనాలను పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో ఏ కాంట్రాక్టరుకు రావలసిన బకాయిలూ రాలేదని ఆయన తెలిపారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గతంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని సురేష్ కోరుతున్నారు.

ప్రారంభానికి నోచుకోలేని రామవరం పంచాయతీ భవనం

చిరుధాన్యాల కేఫ్ ను ప్రారంభిస్తున్న డిఆర్‌డిఎ పీడీ సుధారాణి

చిరుధాన్యాల కేఫ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

చిరుధాన్యాల కేఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌డిఎ పీడీ సుధారాణి కోరారు. శుక్రవారం మండలంలోని మండ గ్రామంలో చిరుధాన్యాల కేఫ్‌ను ఆమె ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఇటువంటి ఆర్థిక వనరులను కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్ డిపిఎం శ్రీనివాసరావు, వెలుగు ఎపిఎం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఛిద్రమైన గొర్రెల కళేబరాలు

లారీ ఢీకొని 12 గొర్రెలు మృతి

ప్రజాశక్తి -భామిని

మండలంలోని పసుకుడి గ్రామ ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున లారీ ఢీకొని 12 మేకలు మృతిచెందాయి. ఈ మేకలు పసుకుడి గ్రామానికి చెందిన గంట వెంకట్‌వి. వెంకట్ కుటుంబానికి మేకలే ప్రధాన జీవనాధారం. చనిపోయిన మేకల విలువ రూ.లక్షా 30 వేలు ఉంటుందని వెంకట్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బస్సు కిందపడి వృద్ధురాలు దుర్మరణం

ప్రజాశక్తి -భామిని

మండలంలోని తాలాడ గ్రామం వద్ద శుక్రవారం ఆర్‌టిసి బస్సు కింద పడి కోన మహాలక్ష్మి(70) మృతిచెందింది. ఒడిశాలోని కొరమ గ్రామానికి చెందిన కోన మహాలక్ష్మి తాళాల వద్ద ఉన్న కుమార్తె ఇంటికి బంధువుల పరామర్శ నిమిత్తం వచ్చింది. ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో, ఆటో ఎక్కబోయి ప్రమాదవశాత్తూ బస్సు కింద పడి మరణించింది. విషయం తెలుసుకున్న పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలోని వీరఘట్టం రోడ్డులో శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహాన్ని ఎస్ఐ ప్రేమమూర్తి గుర్తించారు. ఇటుకల బట్టి కంపు వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ఉన్నట్లు గుర్తించి వెలికి తీశారు. మక్కువ ప్రాంతానికి చెందిన రవి అనే వ్యక్తి కూలి పనులు చేస్తున్నట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.